నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, ఆదివారం 11 మే 2025 VIKARABAD


## ఇవేం సన్న బియ్యం.. అన్నీ నూకలే..



'ఇవేం బియ్యం.. అన్నీ నూకలే.. ముక్కిన బియ్యంతో దుర్వాసన వస్తున్నది'..అంటూ.. కాంగ్రెస్ సర్కారు అందిస్తున్న సన్నబియ్యంపై లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చినా.. రుచిగా ఉండేదని, ఈ బియ్యం రుచిగా కూడా లేవని మండిపడుతున్నారు. రాజేంద్రనగర్ సులేమాన్‌నగర్ డివిజన్‌లోని ఓ రేషన్ షాప్ డీలర్ వద్ద లబ్ధిదారులు సన్నబియ్యాన్ని చూయించి.. ఇలా తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

- వ్యవసాయ యూనివర్సిటీ, (హైదరాబాద్) మే 10

## అనుక్షణం అప్రమత్తం



- భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినా.. అలర్ట్‌గా ఉన్న జిల్లాలోని పోలీసులు
- సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో భద్రత కట్టుదిట్టం
- సీఐఎస్ఎఫ్ బలగాల గస్తీలో శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు

రంగారెడ్డి, మే 10 (నమస్తే తెలంగాణ) : భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినా జిల్లాలోని పోలీసులు మాత్రం ఇంకా అప్రమత్తంగానే ఉన్నారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. ముఖ్యంగా జిల్లా పరిధిలోనే శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉండడంతో దాని పరిధిలో ఆంక్షలు విధించడంతోపాటు సీఐఎస్ఎఫ్ బలగాలు పెద్ద ఎత్తున మోహరించి గస్తీ కాస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్‌లోనూ పాకిస్థాన్ మూలాలు ఉన్నాయన్న ముందు జాగ్రత్తతో పోలీసులు ఎయిర్‌పోర్టును తమ గుప్పిట్లోకి తీసుకుని.. దాని పరిసరాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. పహాడీషరీఫ్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే రోడ్డు.. శంషాబాద్ నుంచి ఎయిర్‌పోర్టు వెళ్లే రోడ్లపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న డీఆర్‌డీఎల్, బీడీఎల్, ఆక్టోపస్, ఎన్ఎస్‌జీ వంటి రక్షణ రంగ సంస్థలు ఉండడంతో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు.

### జంట కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక నిఘా..

జిల్లాలోని సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. ఇటీవల మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఆపద సమయంలో పోలీసులు సైరన్ మోగిస్తే, రోడ్ల పై ఉన్న వారంతా ఇండ్లలోకి వెళ్లాలని పోలీసులు విస్తృతంగా ప్రచారం చేశారు. అలాగే, జిల్లాపరిధిలో అనుమానితులను గుర్తించి.. పాకిస్థాన్‌కు పంపిస్తున్నారు. అనుమానితులను గుర్తించేందుకు పోలీసులు, ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు రంగంలోకి దిగి.. జల్లెడ పడుతున్నాయి.

### జవాన్ల ప్రాణాలు కోల్పోవడం బాధాకరం

కడ్తాల్ : దేశ రక్షణలో తెలుగుబిడ్డ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధా కరమని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి అన్నారు. వీరు డి మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ పర్యా వరణ ప్రేమికుడు పాలడుగు జ్ఞానేశ్వర్ పర్యావరణ శిక్షణ కేంద్రమైన ది ఎర్త్ సెంటర్ ప్రాంగణంలో మురళీనాయక్ జ్ఞాపకర్థంగా మహాబిల్వ మొక్కనాటి దానికి మురళీనాయక్‌గా నామకరణం చేశారు.

## ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)కు

# స్పందన అంతంతే..

మూడుసార్లు గడువు పొడిగించినా ముందుకు రాని దరఖాస్తుదారులు




- వికారాబాద్ జిల్లాలో అనుమతి లేని, అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులు 36,995
- ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం ఫీజు చెల్లించింది కేవలం 6,207 మందే..
- తాండూరు మున్సిపాలిటీ నుంచి అధికంగా12,259 అప్లికేషన్లు
- కొడంగల్ మున్సిపాలిటీ నుంచి అత్యల్పంగా.. 406
- ఫీజు చెల్లించినా రెగ్యులరైజ్ పత్రాల జారీలో అధికారుల నిర్లక్ష్యం

వికారాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ) : ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)కు జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే వచ్చింది. అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొన్న వారు వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు 25 శాతం రాయితీ ఇచ్చినా రెగ్యులరైజ్ చేసుకునేందుకు చాలామంది ముందుకు రాలేదు. ఇప్పటికే మూడుసార్లు గడువు పొడిగించినా జిల్లాలోని గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపాలిటీల్లోనూ ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి స్పందన కరువైందని అధికారులు పేర్కొంటున్నారు. అనుమతిలేని లేఅవుట్లు, అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు మార్చిలో 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, మార్చి నెల ముగిసినా దరఖాస్తుదారుల నుంచి పెద్దగా స్పందన రాకపోవడంతో ప్రభుత్వం మరోసారి గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించినా ఫలితం లేకపోవడంతో మూడోసారి ఈనెల 3 వరకు తుది గడువును విధించినా అంతంతే ఉన్నది. మూడుసార్లు గడువును పొడిగించినా కేవలం 19 శాతం దరఖాస్తుదారులు మాత్రమే తమ అనధికారిక, అనుమతిలేని ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. అయితే, జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు 36,995 దరఖాస్తులురాగా, వాటిలో గ్రామ పంచాయతీల నుంచి 16,095, మున్సిపాలిటీలకు సంబంధించి కొడంగల్ మున్సిపాలిటీ నుంచి 406, వికారాబాద్ మున్సిపాలిటీ నుంచి 4,026, పరిగి మున్సిపాలిటీ నుంచి 4209, తాండూరు మున్సిపాలిటీ నుంచి 12,259 దరఖాస్తులొచ్చాయి. కాగా, కేవలం 6207 దరఖాస్తుదారులు మాత్రమే తమ అనుమతిలేని, అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఫీజును చెల్లించారు. ఎల్ఆర్ఎస్‌కు అత్యధికంగా దరఖాస్తులొచ్చిన తాండూరు మున్సిపాలిటీలో కేవలం 3.93 శాతం దరఖాస్తుదారులే తమ అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. పరిగి మున్సిపాలిటీలోనూ 4209 దరఖాస్తులకుగాను కేవలం 2.34 శాతంతో 910 మంది దరఖాస్తుదారులు, వికారాబాద్ మున్సిపాలిటీలో 4026 దరఖాస్తులకుగాను కేవలం 1000 మందే స్పందించి ఎల్ఆర్ఎస్‌కు ఫీజును చెల్లించారు. అయితే ఎల్ఆర్ఎస్ కోసం 2020లో దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే.

### రెగ్యులరైజ్ పత్రాల జారీలో అధికారుల నిర్లక్ష్యం..

అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. దరఖాస్తుల పరిశీలనలో జాప్యం చేస్తు న్న అధికార యంత్రాంగం...ఫీజు చెల్లించినా రెగ్యులరైజ్ ప్రొసీడింగ్ పత్రాలను జారీ చేయడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఎల్ఆర్ఎస్‌కు ఫీజు చెల్లించి నెలలు గడుస్తున్నా ప్రొసీడింగ్ పత్రాలను జారీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తుండ డంతో దరఖాస్తుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే జిల్లాలో ఇప్పటివరకు 6207 మంది దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్‌కు ఫీజు చెల్లించగా కేవలం 1699 దరఖాస్తుదారులకే అధికారులు రెగ్యులరైజ్ ప్రొసీడింగ్ పత్రాలను జారీ చేశారు. అదేవిధంగా జిల్లాలోని 594 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 2,787 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా 285 మంది దరఖాస్తుదారులకు పత్రాలను అందించారు. అందులో కొడంగల్ మున్సిపాలిటీలో 70 మందికి, వికారాబాద్ మున్సిపాలిటీలో 658, పరిగి మున్సిపాలిటీలో 300 , తాండూరు మున్సిపాలిటీలో 186 మంది దరఖాస్తుదారులకు సంబంధించి జిల్లా యంత్రాంగం ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.

## ఆరోగ్యానికి ప్రమాదం

# ఏఐ వైద్యం



ఏ రోగానికైనా చాట్‌జీపీటీనే ఆధారమా?

- విచ్చలవిడిగా మందులు వాడి రోగాలపాలు
- రోగం ముదిరాక ఆసుపత్రికి వెళ్తున్న వారిలో నడివయస్సు వారే అధికం
- ఏఐ సూచనలు మాత్రమే ఇస్తుంది.. ట్రీట్‌మెంట్ చేయదంటున్న వైద్యులు
- ప్రాణాలపైకి తెచ్చుకోవద్దంటూ సూచన



ఇప్పుడు ఏ సూచన కావాలన్నా.. ఏ విషయం తెలుసుకోవాలన్నా.. ఏఐనే ఫాలో అవుతున్నారు జనం.. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆరోగ్యం విషయంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను నమ్ముకోవడం ఆందోళన కలిగించే అంశం. కొందరు చాట్‌జీపీటీలో ఏ రోగానికి ఏ మాత్రలు వాడాలో వెతుకుతూ.. అధిక డోసులు కలిగిన మందులు వాడేసి.. కొత్త రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. చివరికి రోగం ముదిరి ప్రాణాలపైకి రాగానే దవాఖానలకు పరుగులు పెడుతున్నారు. సొంత వైద్యం ప్రమాదకరమని.. 'ఏఐ వైద్యం' మరింత ఇబ్బందులను తెచ్చిపెడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

-సిటీబ్యూరో, మే 10, (నమస్తే తెలంగాణ)

**హైదరాబాద్‌కు** చెందిన 35 ఏండ్ల కుమార్ ఒళ్లు నొప్పులతో బాధపడుతూ నొప్పులు తగ్గేందుకు మాత్రల కోసం గూగుల్‌ను ఆశ్రయించాడు. వాటిని వేసుకున్న తరువాత కూడా నొప్పులు తగ్గకపోగా జ్వరం వచ్చింది. తీవ్ర జ్వరం, నొప్పులతో వారం రోజుల తరువాత ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. అతడికి వైద్య పరీక్షలు నిర్వహించి సరైన చికిత్సనందిస్తే కాస్త కోలుకున్నాడు.

**రంగారెడ్డికి** చెందిన ఓ గృహిణి ఇంట్లో పనులు చేస్తూ కాలు జారి పడడంతో యూట్యూబ్ లో చూసి సెల్ఫ్ మెడికేషన్ వాడడం మొదలు పెట్టింది. నాలుగు రోజుల తరువాత కూడా నొప్పి తగ్గకుండా కాలుకు వాపు రావడంతో భయపడి వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. నెలరోజుల పాటు చికిత్సనందించి ఆమె ఆరోగ్యం కుదుటపడేలా చేశారు. దాంతో పాటు బిల్లు కూడా అధిక మొత్తంలో వేశారు. గాయమైన మొదట్లోనే వైద్యుడ్ని సంప్రదించి ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు.

సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతుండడంతో ప్రజలు ప్రతి పనికీ ఇంటర్‌నెట్‌పై ఆధారపడుతున్నారు. ఆఖరికి ఆరోగ్యం విషయంలో కూడా సామాజిక మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గూగుల్, యూట్యూబ్‌లతోపాటు కొత్తగా వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తాలూకా చాట్‌జీపీటీలో ఏ రోగానికి ఏ మాత్రలు వాడాలో వెతుకుతున్నారు. ఇలాంటి తరహాలో అధిక డోసులు కలిగిన మం దులు వాడుతూ రోగాల బారిన పడుతున్నారు. మానవ శరీర నిర్మాణం ఒక్కో వ్యక్తికి ఒక్కోలా ఉంటుంది. జీవనశైలిలో మార్పు కారణంగా రోగిని పరీక్షించకుండా మందులు వాడడం కారణంగా ఒకరికి సరిపోయిన మందులు మరొకరికి ప్రాణాపాయంగా మారుతున్నాయి. ఉదాహరణకు అలర్జీ ఉన్నవారికి గూగూల్ చెప్పిన మందులు వాడడంతో శరీరంలో తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఏర్పడి రోగం ముదురుతుంది. సెల్ఫ్ మెడికేషన్ కేసులకు గ్రేటర్ హైదరాబాద్ నిలయంగా మారింది. ఈ తరహా వాడకంతో రోగాలు ముదిరి చివరి దశలో దవాఖానల్లో చేరుతున్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రుల్లో నిత్యం ఉండే ఓపీ సేవల్లో సగానికి పైగా కేసులు ఇలాంటి తరహాలోనే ఉంటున్నాయి. ఇందులో ప్రధానంగా నడివయస్సు వారే అధికంగా ఉండడం గమనార్హం.

చిన్న రోగానికే వైద్యుడి వద్దకు వెళ్తే డబ్బులు ఖర్చవుతాయని చాలామంది భావన. అందుకే ఆసుపత్రికి వెళ్లకుండా ఇంటర్‌నెట్, మెడికల్ షాపులు, ఇరుగుపొరుగు వారి సలహాలతో కావాల్సిన మందులు కొని వాడుతున్నారు. జ్వరం రావడంతోనే ఆలస్యం చేయకుండా మాత్రలు వేసుకుని, తాత్కాలికంగా ఉపశమనం పొందుతున్నారు. నాలుగు రోజుల వరకు అది తగ్గకుండా పరిస్థితి విషమిస్తే గాని దవాఖానల్లో చేరడం లేదు. సీజనల్ వ్యాధుల విషయంలోనూ ఇదే తంతు. జలుబు, దగ్గు సమయాల్లో వైద్యుడ్ని సంప్రదించకుండానే సొంత వైద్యం చేసుకుంటున్నారు. మలేరియా, డెంగీ లక్షణాలు ఉన్నా తేలిగ్గా తీసుకోవడం, రోగం ముదిరిన తరువాత దవాఖానల్లో చేరడం అలవాటుగా మారింది. వైద్య పరీక్షల్లో రోగం తీవ్రత తెలిసి బెంబేలెత్తిపోతున్నారు. జ్వరం వచ్చిన మొదటి రోజే ఆసుపత్రికి వెళ్లకుండా వారం తర్వాత వెళ్లడంతో వైద్యం అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు మరణించిన దాఖలాలూ ఉన్నాయి. గూగుల్, చాట్ జీపీటీల వాడకంతో నిండు ప్రాణాలు పోయే ప్రమాదం పొంచి ఉన్నది.

### వైద్యులను సంప్రదించాలి..

రోగం వస్తే గూగుల్, చాట్‌జీపీటీ వంటి సామాజిక మాధ్యమాలను కాకుండా దవాఖానకెళ్లి వైద్యుడ్ని సంప్రదించాలి. గూగుల్‌లో వెతికితే రోగులందరికీ కామన్‌గా అవసరమైన మందులను మాత్రమే సూచిస్తుంది. వైద్యులు రోగిని పరీక్షించి అవసరమైన మోతాదులో మాత్రలు, చికిత్సనందిస్తారు. ఏఐ అనేది డయాగ్నోసిస్‌లో ఉపయోగకరంగా ఉంటుంది. అంతే తప్ప అదే వైద్యం చేయదు. కేవలం వైద్యుల సూచనల ప్రకారం మాత్రమే పనిచేసే సాధనం. శస్త్ర చికిత్సలు కూడా వైద్యుడే చేయాలి. బద్ధకం, ఆస్పత్రికెళ్తే డబ్బులు ఖర్చవుతాయనే కారణంగా చాలా మంది ఆన్‌లైన్ వైద్యం చేసుకుంటున్నారు. ఆయాసం కాస్త ఎక్కువై నిమోనియాకు దారి తీసేంత వరకూ గూగుల్ ట్రీట్‌మెంట్‌పైనే ఆధారపడుతున్నారు. రోగం రాగానే వైద్యుడ్ని సంప్రదించకపోవడంతో అది ముదిరిన తర్వాత చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తున్నది.

-డాక్టర్ శశిధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, నిమ్స్ ఆసుపత్రి






## అమరవీరుల త్యాగాలు వెలకట్టలేం

దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను వెలకట్టలేమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. భారత ఆర్మీకి సంఘీభావంగా శనివారం ఆమె బడంగ్‌పేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, అమర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడంగ్‌పేట నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు జాతీయ పతాకాలతో ఆర్మీకి సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామిడి రాంరెడ్డి, కామేశ్‌రెడ్డి, అరవింద్‌శర్మ, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామనరసింహాగౌడ్‌తోపాటు పలువురు భారీగా పాల్గొన్నారు.

-బడంగ్‌పేట

## వీర జవాన్లకు ఘన నివాళి



కడ్తాల్ : భారత్-పాకిస్థాన్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులు మురళీనాయక్, సచిన్‌యాదవ్‌ల చిత్రపటాలకు శనివారం కడ్తాల్ మండల కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ముందుగా జాతీయ జెండాలతో పార్టీలకతీతంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచులు తులసీరాంనాయక్, లోకేశ్‌నాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు రాందాస్‌నాయక్, పాండూనాయక్, మన్యానాయక్, రెడ్డినాయక్, రవీందర్‌రెడ్డి, రాంచంద్రయ్య, భగీరథ్, జైపాల్‌నాయక్, కల్యాణ్‌నాయక్, రమేశ్ నాయక్, సరియానాయక్, శ్రీనూనాయక్, శివరామ్, శ్రీకాంత్, శ్రీను, అంజీ, కుమార్, శ్రీకాంత్, రాజు, మధు, సురేశ్, సతీశ్, శ్యామ్, శంకర్, రవి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్‌ఆర్‌పై చెలరేగుతున్న మంటలు

## ఓఆర్ఆర్‌పై

# ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకుల సజీవదహనం
- చికిత్స పొందుతూ మరొకరు మృతి
- ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న కారు
- పెద్దఅంబర్‌పేట సమీపంలోని గండిచెర్వు వద్ద ఘటన

IVవ పేజీలో..